క్లుప్తంగా

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు



అవగాహన ప్రదర్శన చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గణపవరం: మారుతున్న వాతావరణ పరిస్థితులు అనేక వ్యాధులకు కారణమవుతాయని జ్వరాలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. గురువారం పీహెచ్‌సీ పరిధిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సిబ్బంది మలేరియాపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శుక్రవారం పొడి వారంగా పాటించాలని, ఇంటి పరిసరాల్లో మురుగు నీరు, తడి లేకుండా పొడిగా ఉంచుకుంటే దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి దివ్య, సీహెచ్‌వోఏ జి.వెంకటేశ్వరరావు, సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్ఎన్ సత్యవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశరరావుకు అబ్బయ్య చౌదరి నివాళులు



ప్రకాశరావు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి: అందరిని ఆప్యాయంగా పలకరించే వ్యక్తి మట్టా ప్రకాశరావు లేని లోటు తీరనిదని దెందులూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామంలో మట్టా ప్రకాశరావు ఇటీవల మరణించగా ఆయన ఇంటికి అబ్బయ్యచౌదరి స్థానిక నాయకులతో కలిసి గురువారం వెళ్లారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రకాశరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సర్వసభ్య సమావేశం నిర్వహణ



సంతాపం వ్యక్తం చేస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ, ఉద్యోగులు

భీమడోలు: సంతమార్కెట్ నుంచి జంక్షన్ వరకు సెంట్రల్ లైటింగ్ వేయాలని భీమడోలు పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. భీమడోలు పంచాయతీ సర్వసభ్య సమావేశం గురువారం సర్పంచ్ పాము సునీతామాన్ సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెండాలోని అంశాలపై చర్చించారు. తొలుత ఇటీవల మృతి చెందిన వార్డు సభ్యుడు సూరపనేని సురేష్‌కు రెండు నిమిషాల పాటు సర్పంచ్ సునీతామాన్‌సింగ్, గ్రామ కార్యదర్శి కేవీ తనూజ, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు. వర్షా కాలంలో పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సభ్యులు కోరారు. రాత్రి వేళల్లో సంత మార్కెట్ నుంచి జంక్షన్ వరకు వెళ్లే వాహనదారులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, లైటింగ్ సౌకర్యాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని సభ్యులు తెలిపారు. లైటింగ్ ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానించారు.

నేటి నుంచి జగన్నాథ ఉత్సవాలు

కొయ్యలగూడెం: అచ్యుతాపురంలో కొలువైన శ్రీ జగన్నాథ, బలభద్ర సహిత సుభద్రాదేవిల వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆషాడ మాసం ప్రారంభ సందర్భంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం పూరి జగన్నాథుని ఆలయ తరహాలో అచ్యుతాపురంలో ఆలయం, విగ్రహాలు ఉండటం ఇక్కడ విశిష్టత. ఇస్కాన్ సంస్థకు మాతృక అయిన శ్రీరామానంద గౌడీయ మఠం పర్యవేక్షణలో ఆలయ నిర్వహణ ఉంది. పూరిలో నిర్వహించే పూజలు ఇక్కడా నిర్వహిస్తున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలతో పాటు దశావతారాల దినోత్సవాలను ఆలయంలో నిర్వహిస్తుంటారు. కొవ్వూరులో ఉన్న శ్రీ రామానంద గౌడీయమఠం వారు ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తే పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా ఏజెన్సీ మెట్ట ప్రాంత పూరీ క్షేత్రంగా బాసిల్లగలదని సర్పంచ్ మద్దిపాటి నాగమణి పేర్కొన్నారు.

మాంసం దుకాణల వద్ద పరిశుభ్రత పాటించాలి

లింగపాలెం: మాంసం దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ ఎంపీడీఓ సుందరి అన్నారు. గురువారం సీజనల్ వ్యాధుల దృష్ట్యా పారిశుద్ధ్యం పాటించాలని మాంసం దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుందరి మాట్లాడుతూ నిల్వ మాంసం అమ్మరాదని, వ్యాధులు ఉన్న జీవాలను లేదా చనిపోయి న వాటిని కోసి అమ్మినా, నిల్వ మాసం అమ్మి నా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖరీఫ్ సాగుకు ఊతమిచ్చిన వాన

- విత్తనాల సొంత తయారీ మేలంటున్న వ్యవసాయాధికారులు
- మేలైన వంగడాలను ఎంపిక చేసుకోవాలని సూచన



సార్వాకు నారుమడి సిద్ధం చేసుకుంటున్న రైతులు

గణపవరం: సకాలంలో కురుస్తున్న వానలు సార్వా సాగుకు ఊపిరి పోశాయి. ఏటా వేసవి దుక్కుల తరువాత సార్వా నారుమడులు వేయడానికి వర్షాల కోసం రైతులు ఎదురు చూడటం ఆనవాయితీ కాగా ఈ ఏడాది మే నెలలోనే వర్షాలు ప్రారంభమయ్యాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు సకాలంలో నారుమడులు వేయడానికి అవకాశం వచ్చింది. ఈ నెల మూడో వారం నుంచి వర్షాలు ప్రారంభం కావడంతో సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దాళ్వా పంట రైతులకు సిరులు కురిపించింది. ఈ సార్వా కూడా ఆశాజనకంగానే ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. ఇందులో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో ఆకుమడులు వేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నియోజకవర్గంలో 26 వేల హెక్టార్ల సాగు

నియోజకవర్గంలో సుమారు 26 వేల హెక్టార్ల విస్తీర్ణంలో సార్వా సాగు చేస్తున్నారు. దీంతో 16 వేల హెక్టార్ల విస్తీర్ణం మెట్ట ప్రాంతాలైన ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో సాగవుతుంది. దీనిలో 50 శాతం కాలువ కింద, మరో 50 శాతం బోర్ల కింద సాగు చేస్తుండగా, డెల్టా మండలాలైన గణపవరం, నిడమర్రు మండలాల్లో మొత్తం కాలువ కింద సాగు చేస్తున్నారు. బోర్ల కింద సాగయ్యే ప్రాంతాల్లో ఇప్పటికే నారుమడులు వేయగా కాలువల కింద సాగయ్యే ప్రాంతాల్లో రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల నారుమడులు మొలకలు వస్తున్నాయి. ఈ ఏడాది రుతు పవనాలు త్వరగా వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతన్నలు సార్వా సాగుకు ముందుగానే సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. ఈ ఖరీఫ్‌లో ఎక్కువగా స్వర్ణ, పీల్ రకాలతో పాటు పీఎల్ఏ 1100, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 రకాలను సాగు చేస్తున్నారు. ఉప్పు, చౌడు లక్షణాలున్న భూముల్లో ఎంసీఎం 100, ఎంటీయూ 1262, 1061, 1064 రకాలు, ముంపు ఉండే భూముల్లో ఎంటీయూ 1232 రకం, సాధారణ నేలల్లో ఎంటీయూ 1318, 1121 వంటి రకాలు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

రైతు స్థాయిలోనే విత్తనాలు

ఎక్కువ మంది రైతులు విత్తనాలను స్వయంగా సమకూర్చుకుంటున్నారు. గత దాళ్వాలో విత్తనాల కోసం ప్రత్యేకంగా సాగు చేసి, వాటిని ఒబ్బిడి చేసి సార్వాకు సిద్ధం చేసుకున్నారు. దీంతో రైతు స్థాయిలోనే విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. విత్తనాల బస్తా రూ.2000 నుంచి రూ.2200 పలుకుతుంది. దీంతో రైతులు విత్తనాల కోసం బయట వ్యాపారులపై ఆధారపడే పరిస్థితి లేదు. కొద్ది మంది రైతులు మాత్రమే వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. బయట మార్కెట్‌లో కొనుగోలు చేసే రైతులు నాణ్యతను పూర్తిగా పరీక్షించి, గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలు కొని బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

పెట్టుబడి కోసం తిప్పలు

గత ప్రభుత్వ హయాంలో రైతులకు సాగు ఆరంభ సమయానికి రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయంగా రూ.13 వేలు అందించే వారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఈ పెట్టుబడి సాయం రూ.20 వేలకు పెంచుతామని ఊదర గొట్టిన ప్రభుత్వం ఏడాది కాలం దాటినా రైతులకు చిల్లిగవ్వ సాయం అందించలేదు. దీంతో రైతులు రబీ, ఖరీఫ్ పంటలకు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసాను అన్నదాతా సుఖీభవ అని పేరు మార్చారు తప్ప ఆచరణలోకి ఎప్పుడు వస్తుందోనని రైతులు నిట్టూరుస్తున్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలు



సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం వలన సాగుకు అనుకూల వాతావరణం ఉంది. దమ్ము చేసే సమయంలో పొలంలో భాస్వరం వేయడం ద్వారా వేరు వ్యవస్థ బలంగా ఉంటుంది. వర్షాలకు పైరు నేల వాలకుండా పటిష్టంగా నిలబడుతుంది. — ఆర్ఎస్ ప్రసాద్, ఏవో, గణపవరం

మత్తుతో యువత భవిష్యత్ చిత్తు

గణపవరం: మాదక ద్రవ్యాల వినియోగంతో సమాజం సర్వనాశనం అవుతుందని, వీటికి అలవాటు పడిన యువత భవిష్యత్ శూన్యమని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్-1, 2 యూనిట్ల ఆధ్వర్యంలో కాలేజీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, వాటి వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఇటీవల విద్యాలయాల్లో మత్తు పదార్థాల వినియోగం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గణపవరం ఎస్సై మణికుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నిడమర్రు ఎస్సై వీర ప్రసాద్, చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్, వైస్ ప్రిన్సిపాల్ స్వరూప రాణి, ఎన్ఎస్ఎస్-1, 2 యూనిట్ల కో-ఆర్డినేటర్లు శ్రీనివాసరావు, జీవీ రమణ, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ర్యాలీ

దెందులూరు: మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటంతో పాటు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ కె.శ్రీదేవి అన్నారు. గురువారం దెందులూరులో మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణాపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వివేకానంద, ఉపాధి ఏపీఓ ఫాతిమా, వెలుగు ఏపీఓ సురేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, ఎస్సై శివాజీ, ఎంఈఓ ప్రసాద్, అధికారులు, గ్రామస్తులు, నాయకులు, తదిపాల్గొన్నారు.



గణపవరం: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు



దెందులూరు: ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ శ్రీదేవి



భీమడోలు: అవగాహన ర్యాలీ చేస్తున్న సీఐలు, తహసీల్దార్, అధికారులు



ఉంగుటూరు: మానవహారం నిర్మించిన విద్యార్థులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నిషాముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాల సాధనకు సమష్టి కృషి అవసరమని గారపాటి హైమావతీదేవి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్లపట్ల విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఉన్నత పాఠశాలలో ఇంటర్నేషనల్ డ్రగ్స్ రహిత సమాజ ఆవిర్భావం కోసం అవగాహన సమావేశం, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నో డ్రగ్స్ అనే అంశంపై పోస్టర్ తయారీ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కళ్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చాలి

భీమడోలు: మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సీఐ యూజే విల్సన్, అబ్కారీ శాఖ సీఐ బి.సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి గ్రామ పుర వీధుల్లో పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులు అవగాహన ర్యాలీ, ప్రదర్శన నిర్వహిచారు. కార్యక్రమంలోఎస్సై వై.సుధాకర్, ఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, ఎస్సై శశిధర్, ఏఎస్సై వెంకటేశ్వరరావు, గ్రామకార్యదర్శి కేవీ తనూజ, పెద్దలు పైడిమాల యుగంధర్, కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వద్దు.. మంచి అలవాట్లే ముద్దు

ఉంగుటూరు: మాదక ద్రవ్యాలు వద్దు.. మంచి అలవాట్లే ముద్దు అని ఎంపీడీవో జీఆర్ మనోజ్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్యాధికారులు, ఏఎస్ఐ, పంచాయతీ అధికారులు, స్కూలు జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రధాన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: ఉంగుటూరు సెక్షన్ నారాయణపురం సబ్ స్టేషన్ నుంచి నిడమర్రు సబ్‌స్టేషన్‌కు ఆర్‌డీఎస్ఎస్‌లో నూతనంగా నిర్మిస్తున్న నిడమర్రు ఫీడర్ పనుల నిమిత్తం ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నారాయణపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్ఆర్‌పీ ఇండస్ట్రీయల్ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు.

పెదవేగిలో..

పెదవేగి: మండలంలోని పెదవేగి సెక్షన్ వేగివాడ సబ్‌స్టేషన్ పరిధిలో వేగివాడ, చక్రాయగూడెం, కె.కన్నాపురం కండక్టర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ ఈఈ కేఎం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

భీమడోలు: సబ్‌స్టేషన్ పరిధిలో మొక్కలు నరకడం, మరమ్మతుల నిమిత్తం ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శివాజీ తెలిపారు. గుండుగొలను, నాగహనుమాన్ పరిశ్రమల ఫీడర్లు, సూరప్పగూడెం, పోలసానిపల్లి అగ్రికల్చరల్స్ ఫీడర్స్‌కు, సూరప్పగూడెం హెడ్ క్వార్టర్లకు మరమ్మతులు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో భీమడోలు, పోలసానిపల్లి, సూరప్పగూడెం, దిగిలుపాటి దిబ్బ, పాతూరు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

దెందులూరులో..

దెందులూరు: మండలంలో శుక్రవారం సబ్‌స్టేషన్ మరమ్మత్తుల్లో భాగంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు దెందులూరు, సత్యనారాయణపురం, కొత్తగూడెం, కొమిరేపల్లి గ్రామాల్లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.అంబేడ్కర్ తెలిపారు. నాలుగు గ్రామాల్లో రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని విద్యుత్ శాఖ మండల ఇంజనీర్ శ్రీనివాసరావు కోరారు.

కూచింపూడిలో విద్యుత్ అంతరాయం

పెదవేగి: పెదవేగి సెక్షన్, కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం కూచింపూడి గ్రామానికి ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం



హైస్కూలుకు కంప్యూటర్ బహూకరించిన దాత

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల చదువుకు దాతలు, పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని జల్లికొమ్మర సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం అన్నారు. గురువారం కొమ్మరలో ఈ ఏడాది ప్రారంభించిన జెడ్పీ హైస్కూల్‌కు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి చినిమిల్లి రామాంజనేయులు రూ.25 వేల విలువైన కంప్యూటర్‌ను బహూకరించారు. గురువారం కంప్యూటర్‌ను సర్పంచ్, ఇతర గ్రామ పెద్దల సమక్షంలో హెచ్ఎం పుష్పాల ప్రకాష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది స్థానికులు, లయన్స్‌క్లబ్ సభ్యులు డిజిటల్ విద్య కోసం స్మార్ట్ టీవీలను అప్పటి హెచ్ఎం కేటీ సుందరకుమార్ కృషితో పాఠశాలకు విరాళంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో కవల కోదండ రాంబాబు, మహంకాళి, తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



కేసును రాజీ చేసుకునేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కక్షిదారులు

భీమడోలు: జులై 5వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ యూజే విల్సన్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా ముందస్తుగా కేసుల రాజీ విషయమై ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన కక్షిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇరు వర్గాలతో వారు చర్చించారు. పలువురు కేసు రాజీ చేసుకునేందుకు ముందుకొచ్చారు. భీమడోలు కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకోనేందుకు అవకాశం ఉందన్నారు. క్షణికావేశాల్లోనూ, ఇతరులపై కోపంతో గొడవలు జరుగుతున్నాయన్నారు. వీటిపై కేసులు నమోదవుతున్నాయని, దీని వలన సమయం, డబ్బు వృథా అవుతాయన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమన్నారు. ఈ కేసుల్లో ఇరువర్గాలు అర్థం చేసుకొని రాజీ చేసుకోవాలని కోరారు. మండల పరిధిలో 50 కేసులకు చెందిన కక్షిదారులు రాజీ పడేందుకు సిద్ధపడ్డారని ఎస్సై తెలిపారు. పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఏడీగా సుబ్బారావు

చింతలపూడి : చింతలపూడి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులుగా వై.సుబ్బారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఏలూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన బి.నాగకుమార్ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం బదిలీ అయ్యారు. రైతులకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేస్తానని సుబ్బారావు తెలిపారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులో గందరగోళం

- బిల్లులు చెల్లించినా రసీదులు ఇవ్వడం లేదు
- ఉంగుటూరు ఈ-సేవలో వినియోగదారుల ఆందోళన



ఈ-సేవ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యుత్ బిల్లుల చెల్లింపుదారులు

ఉంగుటూరు: విద్యుత్ బిల్లులు సజావుగానే తాము చెల్లిస్తున్నా ఈ-సేవ నిర్వాహకుడు సకాలంలో విద్యుత్ శాఖకు ఆ బిల్లులు జమ చేయడం లేదు. దీంతో వినియోగదారులను బకాయిదారులుగా పేర్కొంటున్నారు. ఈ మేరకు రెండు నెలలు బిల్లులు ఒకేసారి రావడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఎపుడూ ఇలాంటి పరిస్థితి ఏర్పడలేదు. ఈ-సేవ పెట్టినప్పటి నుంచి అప్‌డేట్‌గా ఉండే ఈ-సేవ నిర్వాహకుడు ఈ సారి ఇలా ఎందుకు అయిందనే విషయం మీద గ్రామంలో చర్చించుకుంటున్నారు. సర్వర్ పని చేయడం లేదు. డబ్బులు ఇచ్చి వెళ్లిపోండని చెబుతుండటంతో వినియోగదారులు నగదు అందజేసి వెళ్లిపోతున్నారు. అలాగే నీ దగ్గర ఉంచి తరువాత పని చేసినపుడు కట్టమని కొంతమంది వినియోదారులు అతడిపై నమ్మకంతో వెళ్లిపోతున్నారు. ఇలా రెండు నెలల నుంచి జరుగుతుంది.

రెండు నెలల బిల్లు రావడంతో వెలుగులోకి

అయితే ఆ నగదు వినియోగదారులు చెల్లించినట్లు లేకపోవడంతో విద్యుత్ శాఖ రెండు నెలలు బిల్లు వేసి పంపారు. అపుడు గాని మొదటి నెల డబ్బులు ఈ-సేవ నిర్వాహకుడు చెల్లించలేదని తెలిసింది. దీంతో ఇంత డబ్బు ఎక్కడ తెచ్చి కట్టమని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే విద్యుత్ బిల్లులు పేలిపోతున్నాయి. రెండేసి నెలలు ఎక్కడ తెచ్చి కట్టగలమని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. గోరుచుట్టుపై రోకలిపోటులా ఈ పరిస్థితి తయారైందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే గురువారం విద్యుత్ శాఖ వారు గ్రామంలో మైకు ద్వారా టాంటాం వేయించారు. బిల్లులు సకాలంలో కట్టాలని, మీ కోసం గ్రామంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని ప్రకటించారు. లేకపోతే విద్యుత్ సర్వీసు కట్ చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. దీంతో రెండు నెలల బిల్లులు తీసుకుంటూ కనపడిన వారందరికీ తమ ఆందోళన వినిపించారు. ఏమి చేయాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిల్లు కట్టలేదని ఆవేదన



గత నెలలో ఈ-సేవలో డబ్బులు కట్టాను. అయినా రెండు నెలలు బిల్లు రూ.1000 పైనే వచ్చింది. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. రెండు నెలల బిల్లు ఎక్కడ తెచ్చి కట్టగలం. చిన్న కుటుంబాలు ఎప్పటి బిల్లులు అప్పుడు కట్టడమే కష్టం. దీనికి తోడు రెండు నెలల బిల్లులు ఎలా కట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు.

-వేము చిన్నారావు, ఉంగుటూరు

రూ.3657 బిల్లు వచ్చింది



గత నెల బిల్లు ఈ-సేవలో చెల్లించాం. చాలా సార్లు బిల్లు కోసం తిరిగాం. సర్వర్ పని చేయడం లేదని చెప్పారు. సరే అని వెళ్లిపోయాం. ఇలా 20 రోజులుగా పలుమార్లు తిరిగాను. ఇంత వరకు రశీదు ఇవ్వలేదు. చివరికి రెండు నెలల బిల్లు రూ.3657 వచ్చింది. చిన్న కుటుంబాలు ఇంత నగదు ఎక్కడ తెచ్చి కట్టగలం.

-టేకి కాశీవిశ్వేశ్వరి, ఉంగుటూరు

సాంకేతిక లోపంతో ఇబ్బందులు



ఇలా ఎప్పుడూ జరగలేదు. సర్వర్ పని చేయక పోవడం, ఇతర సాంకేతిక కారణాల వలన సకాలంలో బిల్లులు జమ చేయలేకపోయిన మాట వాస్తవమే. బిల్లులు ఇపుడు కట్టేస్తున్నాం. విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది రానివ్వం.

-కిషోర్, ఈ-సేవ నిర్వాహకుడు, ఉంగుటూరు

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమడోలు: రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. భీమడోలు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లైన కురెళ్లగూడెం, రైల్వే గేటుల వద్ద నాగ హనుమాన్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆర్థిక సాయంతో అందించిన రేడియం స్టిక్కర్ డ్రమ్ములను ఏర్పాటు చేశారు. వాటిని ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా సీఐ యూజే విల్సన్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమదాలు జరిగే యాక్సిడెంట్ జోన్లలో పలుచోట్ల 36 డ్రమ్ములను ఏర్పాటు చేశామన్నారు. ఏఎస్సై వెంకటేశ్వరరావు, నాగ హనుమాన్ సంస్థ ప్రతినిధులు ఏజీఎం నాగేశ్వరరావు, రాజేష్, లక్ష్మణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రేడియం స్టిక్కర్ డ్రమ్ములను పరిశీలిస్తున్న సీఐ విల్సన్, ఎస్సై వై.సుధాకర్